క్లుప్తంగా

సారా విక్రయిస్తే కేసులు తప్పవు

నందికొట్కూరు: నాటు సారా విక్రయించినా తయారు చేసినా క్రిమినల్ కేసులు తప్పవని ఎస్ఐ హుసేన్‌బాషా హెచ్చరించారు. శనివారం పట్టణంలోని షికారిపేటలో సారా అమ్ముతుండగా షికారి లక్ష్మిని అరెస్టు చేశారు. ఆరు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ సారా తయారు చేయడం మానుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొంది ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

ముగిసిన 'వికసిత్ భారత్'

పగిద్యాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించేందుకు మండలంలో చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముగిసింది. చివరి రోజైన శనివారం మండలంలోని ఎం. ఘణపురం గ్రామంలో సర్పంచ్ ప్రతాప రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అనంతరం మొబైల్ వ్యాన్‌లో డిజిటల్ ప్రసారాలను చేసి ప్రధానమంత్రి పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

హద్దు మీరి ప్రవర్తిస్తే కటకటాలు తప్పవు

మహానంది : నూతన సంవత్సర వేడుకల పేరుతో హద్దు మీరి ప్రవర్తిస్తే కటకటాలు తప్పవని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ 31వ తేదీ రాత్రి గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి గొడవలు సృష్టిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే గ్రామాల్లో అల్లర్లు సృష్టించేవారి కదలికలపై, పాత నేరస్తులపై నిఘా ఉంచినట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని హితవు పలికారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏపీఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను డీఎస్పీ శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీఓ తాలూకా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి షాజిద్‌బాషా, ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు రాజశేఖర్, ఫక్రుద్దీన్, హేమసుందర్‌రెడ్డి, రాజారామ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆత్మకూరు: మండలంలోని బాపనంతపురం గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఎస్ఐ ప్రార్థనా మందిరం కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ.10,116, రూ.5,116, రూ.3,116, రూ.2,116 చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. జనవరి 1న పోటీలు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 9866936727 నంబర్లను సంప్రదించాలన్నారు.

రైతులకు నష్టపరిహార నోటీసులు

కొత్తపల్లి: జాతీయ రహదారి 167కే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహార నోటీసులు అందజేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న శనివారం తెలిపారు. మండలంలో జాతీయ రహదారి 167 కే నిర్మాణం కోసం 291 ఎకరాల భూమిని సేకరించగా 511 మంది రైతులు భూములు కోల్పోతున్నారన్నారు. వారిలో 137 మంది రైతులకు నష్టపరిహారానికి చెందిన నోటీలు అందించామన్నారు. ఇందులో 98 మంది రైతులకు చెందిన ధ్రువపత్రాలలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మిగతవారికి త్వరలోనే నష్టపరిహారం వస్తుందని తెలిపారు. జాతీయ రహదారి పనులు 2024 మార్చి, ఏప్రిల్‌లో ప్రారంభం అవుతాయని చెప్పారు.

వెలుగోడుకు చేరిన అయోధ్య అక్షింతలు



అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

వెలుగోడు: రామజన్మభూమి అయోధ్య నుంచి అక్షింతలు శనివారం వెలుగోడుకు చేరాయి. వీటిని ఆలయ కమిటీ అధ్యక్షుడు బళ్లాని వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. పురవీధులు శ్రీరామ నామంతో మార్మోగాయి.

వివాహిత అదృశ్యం

మహానంది: తిమ్మాపురం గ్రామానికి చెందిన తానంగి విమలేశ్వరి మూడు రోజులుగా కనిపించడం లేదని ఆమె తండ్రి దొమ్మరి చిన్న ఓబులేసు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు గడివేముల గ్రామానికి చెందిన దొమ్మరి చిన్న ఓబులేసు కుమార్తె విమలేశ్వరిని మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తానంగి రవితో వివాహం చేశారు. అయితే భర్త, అత్తమామల వేధింపులతో విమలేశ్వరి ఈనెల 28వ తేదీన రాత్రి నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ఇంటింటికీ జలం.. తీర్చేను దాహం

- సున్నిపెంటకు తీరనున్న నీటి కష్టాలు
- ఎమ్మెల్యే చొరవతో నిధుల మంజూరు
- రూ.7కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
- మరో రూ.6.66 కోట్లతో అదనపు పైపులైన్లు
- ఇంటింటికీ కుళాయి ప్రతిపాదన







శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీ (సున్నిపెంట) వాసులు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే శిల్పా చొరవతో నూతన ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. అదనపు డిస్ట్రిబ్యూషన్ లైన్లు వేసేందుకు నిధులు మంజూరు చేయించారు. అలాగే ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పనులు పూర్తయితే సున్నిపెంట వాసులకు తాగునీటి కష్టాలు తొలగినట్లే.

24 ఏళ్ల క్రితం డిజైన్‌తో తరచూ సమస్యలు

శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీ(సున్నిపెంట) గ్రామ ప్రజలను తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. 24 సంవత్సరాల క్రితం అప్పటి డిజైన్ ప్రకారం ఏర్పాటు చేసిన 150 హెచ్‌పీ పంపు తరచుగా కాలిపోతుండడం, మరమ్మతుతు చేయాలంటే కోయంబత్తూరు తీసుకువెళ్లాల్సి వస్తోంది. దీంతో నీటి సరఫరాలో నిత్యం జాప్యం జరుగుతుండేది. వారానికి, 10 రోజులకు ఒకసారి గ్రామ ప్రజలకు మంచినీటి సరఫరా జరుగుతుంది. సున్నిపెంట గ్రామంలో నివసిస్తున్న ప్రజలకు సమృద్ధిగా నీటిని అందించాలంటే రోజుకు 80 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతుంది. గతంలో 5 లక్షల లీటర్ల ఒక గ్రౌండ్ లెవల్ ట్యాంక్, 40 వేలలీటర్ల ఒక ట్యాంక్‌ను ఎంపీడబ్ల్యూఎస్ స్కీమ్ కింద బోర్లను తవ్వి మోటర్లను బిగించి 41 సింటెక్స్ ట్యాంక్‌లు నిర్మించారు.

నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్‌ట్యాంక్

అదనపు డిస్ట్రిబ్యూషన్ లైన్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల నీటి కష్టాలను అధిగమించేందుకు సుమారు రూ.7 కోట్లు ఖర్చు చేసి 90 వేల లీటర్ల ఐదు ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు, లక్ష లీటర్లు, 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్‌ట్యాంక్ నిర్మించారు. గతంలో ఉన్న పైప్‌లైన్లకు మించి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు గ్రౌండ్‌లెవల్ ట్యాంక్‌లకు నూతన పైప్‌లైన్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పబ్లిక్ ట్యాప్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. జలవనరుల శాఖ గతంలో వేసిన పైప్‌లైన్‌లు ఉన్నప్పటికీ అదనంగా గ్రామప్రజల అవసరాల కోసం డిస్ట్రిబ్యూషన్ లైన్లను వేశారు. అయినప్పటికీ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతుండడంతో శాశ్వత పరిష్కారం కోసం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి జలజీవన్‌మిషన్ కింద రూ.1.66 కోట్ల నిధులను డిస్ట్రిబ్యూషన్ లైన్లను వేసేందుకు నిధులను మంజూరు చేయించారు. మరో రూ.5 కోట్ల ను కూడా జలజీవన్‌మిషన్ కింద నిధులను మంజూరు చేయించి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇప్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం మంజూరైన పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ఈ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అవసరమైన మరో 20 కి.మీ మేర డిస్ట్రిబ్యూషన్ లైన్లను నిర్మించి జలవనరుల శాఖ ట్యాంక్‌లు, లైన్లను, రూరల్ వాటర్ స్కీమ్ లైన్లను, ట్యాంక్‌లను అనుసంధానం చేస్తే మంచినీటి కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి. అలాగే డ్యామ్‌సైట్ వ్యూపాయింట్, ఇంటర్మీడియట్ స్టేజ్, ఫిల్టర్‌హౌస్ ప్రాంతాల్లో స్టాండ్‌బై మోటర్లను, కొత్త ప్యానల్‌బోర్డులను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో రెండు, మూడు నెలలు పట్టే అవకాశం ఉంది.

ఫిల్టర్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన పంపింగ్ స్టేజ్

ఇంటింటికీ కుళాయి కోసం ఎదురుచూస్తున్నాం



ఇప్పటికే మా ఊరిలో పైప్ లైన్లు వేశారు. పబ్లిక్ ట్యాప్ కనెక్షన్లు కూడా ఇచ్చారు. దీని వలన కుళాయిల్లో ప్రతి రోజూ నీరు రాక పోయినా, వారానికి రెండు సార్లుగా వస్తున్న నీరు పట్టుకుంటున్నాం. ఇంటింటికీ కుళాయిలు త్వరగా ఏర్పాటు చేస్తే అందరికీ మంచినీరు పుష్కలంగా దొరుకుంది. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న తాగు నీటి సమస్యకు పరిష్కారం దొరికినట్లు అవుతుంది.

– వై.మరియమ్మ, సున్నిపెంట

మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తాం



సున్నిపెంట గ్రామంలో పైప్‌లైన్ నిర్మాణ పనులు డిస్ట్రిబ్యూషన్ లైన్ మరో 20 కి.మీ మిగిలి ఉంది. జలజీవన్ మిషన్ కింద ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి రూ.6.66 కోట్లను మళ్లీ మంజూరు చేయించారు. ఈ నిధులతో అన్ని పనులు పూర్తి చేసి గ్రామ ప్రజలకు నిత్యం నీటిని అందిస్తాం.

–పక్కీరప్ప , ఏఈ , ఆర్‌డబ్ల్యూఎస్

తెలుగు రాష్ట్రాలస్థాయి ఎద్దుల పోటీలు

మహానంది: సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే నెల 16న బండి ఆత్మకూరు మండల పరిధిలోని పెద్దదేవలాపురం గ్రామంలో నిర్వహించే పెద్ద బాదుల్లా స్వామి, చిన్న బాదుల్లాస్వామి, లింగమయ్య స్వామి జాతర మహోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కృష్ణ నాయక్ సౌజన్యంతో బండలాగుడు బలప్రదర్శన పోటీలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. రెండు విభాగాలుగా పోటీలు ఉంటాయని, పెద్ద బండ విజేతలకు వరుసగా.. రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20వేలు బహుమతులు అందజేస్తామన్నారు. చిన్న బండ పోటీలు 6 పండ్ల వృషభాల విభాగంలో రూ.40 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు విజేతలకు ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు 9948383592, 9908698770, 9866584243 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

కొత్తరామాపురంలో సీసీ రోడ్డు



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: మండలంలోని కొత్తరామాపురం గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తరామాపురం శివరాం, రామచంద్రుడు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పర్యటించిన సమయంలో గ్రామ ప్రజలు సీసీ రోడ్డు వేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామంలోని వివిధ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పేదలకు వరం 'ఆరోగ్యశ్రీ'



ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల ప్రాణాలను కాపాడేందుకు ఆరోగ్యశ్రీ పథకం వ్యయం పెంచినట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో లబ్ధిదారులకు నూతన ఆరోగ్యశ్రీ కార్డులు అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స వ్యయ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచి సీఎం వైఎస్ జగనన్న పేదలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాల్లో కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్సలు చేయించుకునే అవకాశం కల్పించారని తెలిపారు. మళ్లీ జగనన్ననే సీఎం చేసుకుంటే పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లాలు ప్రసాద్, హమీద్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ.20లక్షలతో కల్వర్టు నిర్మాణం



వడ్డెమానులో కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలోని పొలాలకు వెళ్లే రస్తాలో రూ.20లక్షలతో కల్వర్టును నిర్మించనున్నట్లు ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పొలాలకు వెళ్లే రస్తా కల్వర్టు సరిగా లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టా చంద్రశేఖర్‌రెడ్డి, రవి, నాగిరెడ్డి, రైతులు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. వెంటనే స్పందించిన ఆయన ఎంపీపీ నిధుల నుంచి రూ.20లక్షలు మంజూరు చేయించి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించి నియోజకవర్గంలో మున్సిపాలిటీతో పాటు మండలాల కమిటీలను కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ప్రకటించింది.

నందికొట్కూరు మున్సిపాలిటీ..

పట్టణ ప్రెసిడెంట్‌గా ఎస్.మన్సూర్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్లుగా విజయభాస్కర్, ఉపేంద్రా, జనరల్ సెక్రటరీలు పుల్లయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, ట్రెజరర్ భార్గవ్‌తో పాటు కార్యదర్శులు ఐదుగురు, సభ్యులు 15 మంది ఎంపికయ్యారు.

నందికొట్కూరు మండలం..

మండల ప్రెసిడెంట్‌గా జీ.రవియాదవ్, వైస్ ప్రెసిడెంట్లు అశోక్‌రెడ్డి, అక్తర్‌బాషా, జనరల్ సెక్రటరీలుగా హరీష్‌యాదవ్, తలారి ఎల్లా నాయుడు, సుధాకర్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీలు 8 మంది, జాయింట్ సెక్రటరీలుగా ఏడుగురు నియమితులయ్యారు.

జూపాడుబంగ్లా మండలం..

మండల ప్రెసిడెంట్‌గా తోకల కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా మధు గోవర్ధన్, అలిసాహెబ్, జనరల్ సెక్రటరీలు పీఎం. మహేశ్వరరెడ్డి, సోలేమాన్, గోవింద్ యాదవ్, కోశాధికారి సర్వేశ్వరరెడ్డి, సెక్రటరీలు ఐదుగురు, సభ్యులు 15 మంది ఎంపికయ్యారు.

కొత్తపల్లి మండలం..

మండల అధ్యక్షుడిగా కే. సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎం. ముర్తుజా, జనరల్ సెక్రటరీలుగా ఎండీ హుసేన్ సాహెబ్, నాగార్జునరెడ్డి, శేఖర్, కోశాధికారి రామిరెడ్డి సెక్రటరీలు ఐదుగురు, సభ్యులు 15 మందిని ఎంపిక చేశారు.

మిడుతూరు మండలం..

మండల ప్రెసిడెంట్‌గా లోకేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా మొల్లా అన్వర్‌బాషా, నాగేశిరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా చిన్న పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, పణిభూషణ్‌రెడ్డి, కోశాధికారి రాజేష్, సెక్రటరీలు ఐదుగురు, సభ్యులు 15 మంది నియమితులయ్యారు.

పగిద్యాల మండలం..

మండల ప్రెసిడెంట్‌గా పుల్యాల నాగిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా వెంకటేశ్వర్లు, నాగస్వామి, జనరల్ సెక్రటరీలుగా ముర్తుజావలి, భాస్కర్‌రెడ్డి, పాలూరి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పసుల వెంకటేశ్వర్లు, సెక్రటరీలు ఐదుగురు, సభ్యులు 15 మందిని పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

పాములపాడు మండలం..

మండల ప్రెసిడెంట్‌గా రామలింగేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా మాలిక్‌బాషా, ఎల్వీ రమణారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా మధుసుదన్‌రావు, నరసింహులు గౌడు, శ్రీనివాసులు గౌడు, కోశాధికారి ప్రసాదరావు, సెక్రటరీలు ఐదుగురు, సభ్యులు 15 మందిని పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది.

పట్టణాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: పట్టణాభివృద్ధే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని, కార్మికులు సమ్మెలో ఉన్నా.. చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో ప్రజలకు ఉపయోగపడేందుకు వీలుగా కాలిపోయిన మోటార్లకు మరమ్మతు చేయిస్తామన్నారు. వెలుగోడు రిజర్వాయర్ నుంచి ఆత్మకూరు పట్టణానికి మంచినీటి సౌకర్యం కోసం చెడిపోయిన మోటార్ల మరమ్మతుకు రూ.12,17,140 ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వీటికి త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. పట్టణంలోని సంతమార్కెట్, దినసరి సంత, చిన్నకమేలా, పెద్ద కమేలా, చేపలు, చికెన్ అమ్మకాల మార్కెట్ ఫీజులు వసూలు చేసేందుకు త్వరలో టెండర్లను వేసేందుకు కౌన్సిల్ అనుమతి కోరారు. ఈ ఏడాది 16వ ఆర్థిక సంఘానికి సంబంధించి దాదాపు రూ.95,32,742లతో నీటి సరఫరాకు, ఇతర కార్యకలాపాలకు అనుమతి కోసం ప్రతిపాదన పంపనున్నట్లు వెల్లడించారు. పట్టణంలో కుక్కల బెడదను తప్పించేందుకు కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. పెద్దపీర్లవీధి, పోస్టాఫీస్ వీధి, తోటగేరిలో తాగునీటి సౌకర్యం కోసం రూ.లక్ష వెచ్చించి సత్వరమే 7.5 హెచ్‌పీ మోటర్‌ను కొనుగోలు చేసి నీటి సరఫరా చేసేందుక సభ్యులు అనుమతించాలని కోరారు. అనంతరం ప్రవేశపెట్టిన తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు విజయ్, విజయచౌదరి, సుల్తాన్, కో ఆప్షన్ సభ్యులు రషీద్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతు బాగుంటే దేశం బాగుంటుంది

మహానంది: రైతు బాగుంటే దేశం బాగుంటుంది. వ్యవసాయం బాగుంటే రైతు బాగుంటాడు అని తిమ్మాపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావు అన్నారు. పాఠశాల విద్యార్థులతో శనివారం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి నాట్లపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయించారు. వరి నాట్లు వేసే విధానంపై విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావు పలు సూచనలు చేశారు. గ్రామంలోని వ్యవసాయ పరిస్థితులు జలవనరులు, నేల రకాలు, పంటలు తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో టీజీటీ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ యాక్ట్ అమలు

పగిద్యాల: 2024 నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో శాంతి భద్రతల దృష్ట్యా మండల వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున శనివారం తెలిపారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి వరకు నూతన సంవత్సరవ వేడుకలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. రోడ్లపై కేక్ కట్ చేయడం, బైక్‌ల సైలెన్సర్లు తీసి నడపడం వంటివి చేస్తే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే మద్యం సేవించి రోడ్లపై కనిపిస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఆదివారం పగలు, రాత్రి ప్రధాన కూడళ్ల వద్ద పోలీసుల నిఘా ఉంటుందన్నారు. వేడుకలను ఎవ్వరి ఇళ్లల్లో వారు కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

వెలుగోడు: స్థానిక లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో భాగంగా శనివారం నిర్వహించిన కమ్యూనిటీ ఔట్ రీచ్ ప్రోగ్రాం ఆకట్టుకుంది. 50 మంది విద్యార్థులు 10 సైన్స్ ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎంఎఫ్ ఇమ్మానియేల్ , ఫయాజ్, రియాజ్, ఫయాజుద్దీన్, అనిల్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఔటర్ రింగ్‌రోడ్డులో చిరుత



రక్షణ గోడపై చిరుత

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని పంచమఠాల్లో ఒకటైన సారంగధర మఠం సమీపం ఉన్న ఔటర్ రింగ్‌రోడ్డులో రక్షణ గోడపై చిరుతపులి పడుకొని ఉండటం శనివారం రాత్రి కనిపించింది. స్థానికులు ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్తుండగా చిరుతను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అటవీ జంతువుల సంచారం నిరోధించడానికి ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ ఐరన్ మెష్‌తో ప్రహరీ నిర్మిస్తున్నట్లు ఈఓ, ట్రస్టు బోర్డు చైర్మన్లు నాలుగు రోజుల క్రితమే కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు



చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉందని, మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు వేస్తుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వెనుకబడిన కాలనీలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు రూ.16 కోట్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. సమావేశంలో కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్లు రబ్బాని, ప్రశాంతి, డీఈ నాయబ్ రసూల్, డీటీ సోమేశ్వరమ్మ, కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



జీఈఆర్ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

పగిద్యాల: బడిఈడు కలిగిన పిల్లలు బడిలోనే ఉండాలని, చదువుకోవడం వారి హక్కు అంటూ శనివారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండల విద్యాధికారి సుభాన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీలో ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి పాల్గొన్నారు. బస్టాండు ఆవరణలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థుల చేత ఎంఈఓ ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మిషన్ జీఈఆర్ 100 శాతం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలో చదువు ప్రాముఖ్యతను వివరిస్తున్నామన్నారు. 5 ఏళ్ల వయస్సు నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలందరూ బడిలో ఉండాలన్నదే గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో(జీఈఆర్) ఉద్దేశమని తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

నందికొట్కూరు రూరల్ : రైతులు ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లేలా ప్రోత్సహించాలని మండల వ్యవసాయాధికారి షేక్షావలి అన్నారు. శనివారం మండలంలోని మల్యాల గ్రామంలో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు శనప పంటలో మొక్కలు చనిపోకుండా ఉండేందుకు ట్రైకోడెర్మా విరిడిని స్ప్రే చేయవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు



పగిడ్యాలలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



పార్నపల్లెలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పాములపాడు: రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శనివారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను ఉప సర్పంచు నరసింహులు ప్రారంభించారు. వేంపెంట జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలను హెచ్‌ఎం క్రిష్ణమూర్తి టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్, పీడీలు రాజశేఖర్, నాగరాజు, సాయికృష్ణ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పగిద్యాల: ఆడుదాం.. ఆంధ్రా క్రీడల్లో ఐదవ రోజైన శనివారం పగిడ్యాల, పాత ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పడమర ప్రాతకోట గ్రామాల్లోని జిల్లాపరిషత్ పాఠశాల క్రీడా మైదానాలలో క్రికెట్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడలకు సంబంధించి 17 మ్యాచ్‌లను నిర్వహించినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానంది: ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పేరిట నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా జరుగుతున్నట్లు పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్ తెలిపారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె సచివాలయం ఆవరణంలో శనివారం జరిగిన పోటీల్లో గ్రామీణ యువత ఉత్సహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండలంలో ఆడుదాం ఆంధ్ర పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శనివారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, పోటీలు హోరాహోరిగా సాగాయి. ఈ పోటీలను పంచాయతీ కార్యదర్శి నూర్, వీఆర్వో మద్దిలేటి ప్రారంభించారు.